# *మాలదాసరి

## ౧

సోమశర్మది రాకాసి పట్టు. అతఁ డాపట్టుతో పదునాలుగు విద్యలను సాధించెను. అతఁడు 'యతి యనిన ప్రతి' 'ఎడ్డె మనిన తెడ్డెము' అని అనును. అతఁ డిపుడు తార్కికులకు వాకట్టు. శాబ్దికులకు కనికట్టు. అతఁ డే శ్రౌతిని ప్రాయశ్చిత్తము చేయింపక విడిచిపెట్టలేదు. అవధానుల కతఁడు గండమాల. స్మార్తజ్ఞులకు పెద్దపులి.

అతఁడు పలువుర ఢక్కలను పగులఁగొట్టించెను. వాదములలో పందెము వయిచి పలువుర తలలు గొఱిగించెను. కొందఱచెంపలు చెప్పులతో వేయించెను.

అతనికి వేదాంత మనిన మంట. కయ్యాల కాఁడయ్యె కావున నతఁ డావాదములలోనికిఁ గూడ దుమికి పెద్దలతో ఓడియు నేనే గెలిచితి నని చిల్లరరాజులకడ లేఁతసొరకాయలు కోయుచుండెడివాఁడు.

సోమశర్మకు ధనమే సగుణబ్రహ్మము. భోగమే నిర్గుణబ్రహ్మము. యాచనమే భజనము. చాటుపద్యపఠనమే సహస్రనామపూజ.

---

* ఈకథను కృష్ణరాయలు ఆముక్తమాల్యదకు కానుక యిచ్చిరి. దానికి ఇది కొంచెము మార్పుతో అనుకరణము.

ఒక సదస్యమున అగ్రతాంబూలముగుఱించి మీమాంస కలిగెను. ఏండ్లకు చిన్నయయినను కర్మలలో పెద్దయగు నొక బ్రాహ్మణునకు అది లభించెను.

తాంబూలముతో పని లేకయే సోమశర్మయధర మెత్తి బాఱెను. మోము చెమరించెను. గొంతుక డెక్కపట్టెను. అతఁడు లేచి—

'అగ్రతాంబూల మిచ్చితి రథమునకును'

అని రెండు పాదములు మట్టి తిట్టి లేచి పోయెను. ఆ నాఁటినుండి సోమశర్మ కగ్రతాంబూలమునెడ నాగ్రహము కలిగెను. దానికి యజ్ఞము చేయ సంకల్పించుకొనెను. యాగభిక్షకు బయలుదేఱెను.

అపుడు కురుంగుడిలో బ్రహ్మోత్సవము. 'అచట పారాయణము చేసి గడనసేయవచ్చును. వాదభిక్షయు, యాగభిక్షయు వేఁడి మూట కట్టవచ్చును' అని యెంచి సోమశర్మ కురుంగుడికి మూటకట్టెను.

కురుంగుడికి దవ్వుగా నొకమాలపల్లి. అందు చెప్ప రానివాఁ డొకఁడు కలఁడు. చెప్పులు కుట్టుటలో నతఁ డందె వేసెను. మోటబాననకు వానిదే వరవడి. కోఁతురు వేయుటకు వాఁడు పెట్టినదిపేరు. పశువుల కతఁడు బలరాముఁడు.

బ్రాహ్మణుని గనినంతనే కానఁబడనంత దవ్వుగా నతఁడు పరుగెత్తును. దేవళపు శిఖరము కానిపించినంతనే సాగలుదండములు పెట్టును. అతఁడు మసిపాఁత ముడిచిన మాణిక్యము.

వానిచెవుల శంఖచక్రాకారము లయిన రెండిత్తడి కమ్మలు. మెడలో గవడ తులసిపూసల తావళము. మేన పట్టె వర్ధనములు. తలమీఁద తిరుపతివెంకన్న పాదరక్ష. ఆ పైని మొగలియాకు గొడుగు. బుజమున చిటి తాళములు. చేత గుజ్జుపు వెంట్రుకలతోఁ గుట్టిన ఓటి కిన్నెర. అతఁ డీవేసముతో ప్రతిదినమును తెలవాఱుజామున కుఱుంగుడికి వెళ్లి బరువులు డించి ప్రాకారమువెలుపట మంగళకైశికి రాగముతో భగవం తుని గానము చేయుచుండును.

కోవెల తూమునుండి జాలువాఱు ముటికినీరు శూద్రుఁ డొకఁ డీయఁగా నతఁడు కనుల కద్దుకొని నెత్తిని జల్లుకొని త్రావి ప్రసాదము పంచిపెట్టువఱకు కనిపట్టియుండును. పిదప శూద్రుఁ డెవఁడేని తనభక్తికి మెచ్చి తాను దెచ్చికొనిన ప్రసా దములో కొంత యిడరాఁగా నతఁడు కిన్నెరజాఁపి దానిపయి నుంపించికొని అతనికి మ్రొక్కి సాపడి తాండవ మొనరించును పిమ్మట గ్రామపు వెలిదారిని బడి తన పంచమస్వరము వినిపించి కోయిలలచేఁగూడ ననిపించి తనగుడిసెకు మరలుచుండును. ఇది యతనికి నిత్యవ్రతము.

౨

స్వామి తిరునాళ్ల కూళ్లన్నియు కోవెలముందే యుం డెను. త్రివర్ణేతరులగు భక్తు లందఱును ప్రాకారము వెలుపటనే మాలదాసరిసంకీర్తన మాలకించుచుండిరి.—

ఏదీ? మూఁడు పాదా
మూలు భూదా
న మి చ్చేదా
నంటి వేదీ?

వాకిట నున్న మాలని గానమునకు వామనస్వామి సొక్కుచుండెనా లేక తన యెట్టెదుటి సభామంటపమునఁ గూరు చుండియున్న పండితుల శాస్త్రార్థ మాలకించుచుండెనా?

చోళేంద్రసింహుఁడు వీవన పూని కన్ను లఱమోడ్చి బాపనసాములకు విసరుచుండెను. పలువురు శిష్యులతో సోమ శర్మ సభామంటపమునఁ బ్రవేశించెను. పండితులమీఁద కన్ను లచే నిశితబాణముల గుప్పి మహారాజ సన్నిధానమున కేఁగి —'దేవా! ముందు వాదభిక్షయుఁ బిదప యాగభిక్షయు దయ చేయునది' అని యతఁడనెను.

రాజొకతూరి కను లెత్తి నమస్కరించి 'అయ్యా! వాదము జరగుచున్నది; సభలోనికి దయచేయుఁడు' అనెను. అనిన వెంటనే సోమశర్మ కుడికాలు ముందు పెట్టి వాదమున కుఱికెను.

'భక్తిచే ముక్తి సులభము' అను ప్రసంగ మపుడు నడచు చుండెను.

సోమశర్మ వెంటనే యిటు లనెను—'భక్తిచే ముక్తియే? ముక్తి పప్పా లేక ఉప్పా? భక్తి కల్లు. దానఁ బిచ్చి యెత్తును.

కర్మతోఁ గూడని భక్తి హేయము. కర్మమార్గమే క్రమమార్గము. ఇదియే శాస్త్రసిద్ధము.'

'కర్మ జఘన్యము. భక్తి ముఖ్యము. దాని కెవరియెడను పక్షపాతము లేదు. అంతరువులు లేవు' అని ఆవలిదెసనుండి ఖండనము వచ్చెను.

'మీవి చిల్లరశాస్త్రములు. మీరు పాషండులు. నూట పదునొకొండులు. కర్మ చండాలురు' అని సోమశర్మ చివాలున రాజుకడకుఁ బరువిడి 'తా మిపుడు వాదము వినవలయును' అనెను.

రాజిటు లనెను — 'వామఃస్వామి మీ వాదము నాలకించుచుండెనా లేక ఆగానము నాలకించుచుండెనా?'

అందఱును కిలకిల నవ్విరి. సోమశర్మ అగ్నిశర్మ అయి పోయి—'ఆ మాలముండకొడుకులకే యివి రోజులు. వారినే ఇచటఁ బూజింపుఁడు' అని మహారాజును, పండితులను తూల నాడి రుసరుసలాడుచు రివ్వున ప్రాకారము వెలుపటికి వచ్చెను.

సోమశర్మ యెట్టెదుట మాలదాసరి. వాని చుట్టును మాలమూఁక. దానిచుట్టును సాతానులగుంపు.

మాలఁడు భగవంతుని పాడిపాడి 'తకఝుం తకఝుం తామరసాక్షా' అని తాండవింపఁదొడఁగెను. వాని గండస్థలము లానందాశ్రువులతోఁ దడిసి చెక్కిన యింద్రనీల ఫలకములా యనునటు లుండెను. వాని హస్తమునందలి కిన్నెర రామచిలుక

వలె పలుకుచుండెను. అతనితాండవముచే గుండులే నీరయిపోవుచుండెను.

కొండంత యీసు సోమశర్మకనుల కెగఁదట్టెను. 'ఇది యేమంత పాండిత్యమా? వాదమా? విద్యయా! ఈపిచ్చియెగురుట చూచుటల కెంతసభ! పిచ్చుగుంటులవారి పెండ్లికి గంగిరెద్దుల వారి గానమఁట! చీ చీ చాండాలుఁడా! నీకే యిచట బ్రహ్మోత్సవము! బయట నేమి గతి? లోపలికి విజయం చేయుము' అని యనెను.

'తకఝుం తకఝుం——తామరసాక్షా !'

'నీతకఝుం తగులఁబడ ! ఆవలికి ఛావు !'

మాలదాసరి తాండవమునడుమఁ గొంచెము తూలెను. శరీరము స్తంభించెను. చూపు నిలిచెను. కంఠమున గద్గదిక యేర్పడెను. వెంట్రుకలు నిటారుగా నిలిచెను. అడవిమేఁత కరిగిన తల్లికి అఱచు లేఁగవలె దాసరి 'గోవిందా' అని యఱచెను.

ఆయఱపుతో ఆలయము మాఱుమ్రోఁగెను, చుట్టునున్న జనులందఱును 'గోవిందా' యని యఱచిరి.

'ఛీ ఛాండాలుఁడా ! ఆవలికి పో.'

ఆ భేరీధ్వనిలో ఈ సోమశర్మ ఈల వినువారెవరు? సోమశర్మ మఱి చేయునది లేక తిట్టి తిమ్మి చేతికి దొరకిన రాలు తీసి రువ్వి, 'తొలఁగుఁడు! తొలఁగుఁడు' అని కేకలు వేసెను. జనులు పాయ యిచ్చిరి. మాల లెల్లరును కాకులవలె లేచిపోయిరి.

దాసరి యొకఁడే తన్మయుఁడయి నిలువఁబడియుండెను. అతని పెడతలమీఁద నొకరాయి విసురుగా పడెను. బుస్సున రక్త మెగసెను. దాసరికి తెలివివచ్చెను. పెడతలగాయమును అఱచేత మూసిపట్టి సాష్టాంగపడి 'అపరాధమును క్షమింపుఁడు' అని సోమశర్మను వేఁడికొని మాలదాసరి దూరదూరముగా తొలఁగిపోయెను.

'ఈయేడు పిందాఁకనే యేడ్వకపోతివా ? పూవువలె పోయియుందునే' అని సోమశర్మ వెళ్లిపోయెను. అతని వెను వెనుకనే శిష్యులును కర్మవాదులును వెనుక ముందులు చూచు కొనుచు నిర్గమించిరి.

3

ఆవెళ్లుట వెళ్లుట సోమశర్మ మధుర వెళ్లెను. వెళ్లిన కొలఁదిననకే అతని కలహాకంఠ ప్రసిందటకును కర్ణజ్వరము కలిగించెను. అతని ధాటి ముందు సముద్ర మొక చెరువు. శాస్త్రార్థములలో నతని కెటఁ జూచినను చేటదెబ్బ విన్నఁబడఁజొచ్చెను. బండ శిష్యుఁ డొకఁడు తక్కఁ దక్కినవారందఱును అతనిని విడనాడిరి.

... యిట్టి కలిమిలోఁగూడ ధైర్యము విడువక, వెలివేయఁబడిన పూరిచుట్టును దిరిగి లఘుప్రాయశ్చిత్తములు పెట్టి వారి పంక్తిని గుడిచి బంగారము గడించెను. భాస్కరాచార్యులలోఁ దూఱి కోమటియిండ్ల పుణ్యాహములలో దెబ్బలాడి బిగుస్యము

సంపాదించి సంచుల కెత్తెను. గ్రహణములలో జపములు స్నానములు చేసి ఆపుణ్యమును దొరలకు ధారాదత్తము చేసి అర్జించెను. మహిషీదానములకు మేషీదానములకు పాపదానములకు పత్తన మెల్లయు గుత్తగొనియెను. దర్భపోటులమీఁద దర్భపోటులు తినెను. పిలువనినాఁడు చనవుచేసికొని వెళ్లి పిలిపించికొని పితృశేషము తినఁబోడఁగెను. ఇంతటితోఁ బోక వీనియన్నిటిని తల దన్నిన తులాభారదాన మొకటి గైకొనెను.

ఇటులు కూడఁబెట్టిన పప్పుప్పు నేబియ్యము లన్ని నిలువ డబ్బుతోఁగూడ కోమటికి వడ్డి కిచ్చెను. ఇపుడు తన్ను బిలుచువా రెవరును లేరు! చెడు దానములై పోయెను. రొక్క మిచ్చి యట కూళ్లు మెక్కవలెను. కావున నతఁ డింటికిఁ భోవసమకట్టి మాదిగ వాడకు వెళ్లి చెప్పులుకొని నూనె పట్టించి తంగేడాకు తెచ్చుకొనెను. గడ్డము చేయించుకొని వేనీళ్లయంగడికిఁ బోయి వెల యిచ్చి దరువులమీఁద దరువులతో తల యంటించుకొనెను. [illegible]ట పూఁటింటి కెప్పటికంటె నెక్కుడుగా పాలు పెరుఁగు నే గూర[illegible] లంపెను. వక్కలాకులతో అడపము నింపెను. శిష్యుని [illegible]జము మీఁదికి బియ్యపుమూట తయారు చేసెను. ఆలికి రంగు రంగుల చీరలు కొనెను. పి[illegible] యింటికి వెళ్లి అరుఁగుమీఁదఁ గూరుచుండి తాటాకు పట్టుకొని సెట్టిని డబ్బిమ్మనెను. [illegible]డు వడ్డితోఁగూడ డబ్బు సోమశర్మ ముం దిడెను. సోమశ[illegible]క్క పద్దే చదివి బియ్యము మొదలగు ద్రవ్యముల వెల తక్కువ కట్టితి వనియు, ఇచ్చిన తిథులింకను లోఁగడి వనియు, అనుకొనిన

వడ్డి వేలు, ఇపుడు చెప్పు వడ్డి వేలనియు అల్లరి చేయఁ దొడఁ గెను. కోమటి కాతా తెఱచి బియ్యములోనగువాని పద్దులును వెలలును చూపెను. తిథులును సోమశర్మ వ్రాలును గనఁబఱచెను. వడ్డియు వ్రాఁతలోఁ జూపెను. సోమశర్మ 'ఇది యంతయు సృష్టి; బ్రాహ్మణుని ధనము హరించి బాగుపడవు' అనుచు రచ్చ కెక్కెను.

సోమశర్మ చెప్పులు కొనుట మొదలుకొని రచ్చకెక్కుట వఱకుఁ గల ప్రయాణసన్నాహ మంతయు పిల్లిగడ్డమువాఁడు కాకిమీసాలవాఁడు, ఒకఁడు కనిపట్టుచుండెను.

౪

పొరుగూరులకుఁ బోవు బాటసారు లందఱును ఒకరికొకరు తోడుగా సత్రమున గుట్టుపెట్టి నిదిరించుచుండిరి. కాకిమీసాల వాఁడుగూడ తా నొకప్రయాణపు సంచిని దెచ్చి తలక్రిందఁ బెట్టుకొని నిదిరించెను.

నడిరేయి ఆకాకిమీసాలవాఁడు ఉలికిపడి లేచి 'అయ్యో! తెల్లా రొచ్చింది, లెగరా, లెగూ' అని ప్రక్క వానిని లేపెను. ఆపిలుపు విని ఒకరి నొకరు లేపుకొనిరి. బాటసారు లందఱును రెండు మూఁడు గుంపులుగా ముందరి వాఁడు నడచిన త్రోవ నడవఁ దొడఁగిరి.

ముందరివాఁడు 'ఇది దారి' యని వారి నందఱను అడ

పికిఁ బట్టించెను. ముం దొక సెలయేఱుండెను. తెరువరు లంద ఱందు దిగిన వెంటనే కాకి మీసాలవాఁ డొకయీల వైచెను.

అపుడు అఱచేత గీఱలు కనఁబడుపాటి వెలుతురు రాఁదొడఁగెను. బాటసారులముందు పెద్దయెలుఁగుతో అలుఁ గొకటి పడెను. బిఱ్ఱుబిఱ్ఱు మను మ్రోఁతలతో ఒడిసెలలనుండి రాలు పడఁదొడఁగెను. పథికు లందఱును తిరుగుడు పడిపోయిరి. ఇంతలో బేతాలురవలె దొంగలు రాహువులవంటి ఆయుధములతో వారి నందఱను చుట్ట వయిచిరి. పాంథులు విఱుగఁ ద్రొక్కుకొనిరి. కొందఱు తమకడ నున్న ద్రవ్యమును రుప్పలలోఁ బాఱవయిచిరి. దొంగలు దుడ్డులతో మోఁదిరి. పట్టుకొనిన పయిబట్టలు చింపుకొని కొందఱు పాఱిపోయిరి. కొందఱు—'నాయనలారా! ఇది దేవతార్చన సజ్జ. దీనిని దాఁకకుఁడు. ఇది పోవుచో మాకు పస్తు' అని విప్పిచూపి దానికిఁ గట్టిన వలువల నిచ్చివేసిరి. కొందఱు 'మీ రెడముగా నుండుఁడు. ఆఁడువారి నంటకుఁడు మాగుంపులో నున్న దెల్లయు నిప్పింతుము' అని నిలువు దోఁపిచ్చి వెళ్లిపోయిరి.

దొంగలు కొందఱను చాటునకుఁ గొంపోయి శోధించిరి. పొదలలోఁ దూఱినవారిని ఈఁటెలతోఁ బొడిచి వెలికి లాగిరి. సిగలు విప్పి చూచిరి. చెప్పులయట్టలను దబ్బనములతో గ్రుచ్చి పరిశోధించిరి.

కాకిమీసాలవాఁడు వెదకివెదకి వేసారి తుదకు సోమశర్మను పట్టుకొనెను. సోమశర్మ శిష్యుని విడిచి పరుగిడఁ దొడఁ

గెను. కాకిమీసాలవాఁడు వెంబడించి సోమశర్మ కాలికొంకులకు వంకరకత్తితగిలించి గుంజెను. కొంకులు తెగి సోమశర్మ కూలఁబడెను. కాకిమీసాలవాఁడు సోమశర్మదోవతి లాగి మొలలోని వరహాలజాలెను విప్పుకొని అంటుపోఁగులవఱకును చెవులు చిటుక్కునఁ గోసికొనెను. నోటిలోని యూరకుండక సోమశర్మ 'ఓరి దొంగముండకొడుకా ! నీది మాపొరుగూరే లే; ఈ డబ్బు నీకుఁ దక్కినపుడు చూచెదనులే' అనెను. పాఱిపోవుచున్న కాకిమీసాలవాఁడు వెనుదిరిగి సోమశర్మను సున్నములోని కెముక మిగులనీయక నలుఁగఁబొడిచెను. ఇంతలో వెనుకనుండి వచ్చు బాటసారుల అలికిడి ఆయెను. కాకిమీసాలవాఁడును మిగిలిన దొంగలును చీఁకటితోపాటు మాయమయిపోయిరి.

వెనుక బాటసారుల గుంపులో వచ్చుచున్న సోమశర్మ బావమఱఁది పరువెత్తుకొని వచ్చి చూచి వగచి చీవాట్లుపెట్టి కావడించి సోమశర్మను మోసికొనిపోఁ దొడఁగెను. సోమశర్మకు స్పృహ తప్పెను. అతని బావమఱఁదికి దప్పి పుట్టెను. అంతలో కురుంగుడి దాపున నొకయేఱును పెద్దమఱ్ఱియుఁ గానిపించెను. సోమశర్మను మఱ్ఱిక్రింద దింపి అతనిబావమఱఁది నీరు త్రావఁబోయెను.

మఱ్ఱిచలువచే సోమశర్మకు తెలివి వచ్చెను. కనులెత్తి చూచెను. పెద్దమఱ్ఱి. కురుంగుడి దేవళము నుండి ఘంటాధ్వని వినఁబడెను. మాలదాసరి గుఱుతువచ్చెను. పిమ్మట నొప్పి హె

చ్చెను, మగత గ్రమ్మెను. చావు తెలివి పుట్టుకొని వచ్చెను. ఆ తెలివిలో కాకిమీసాలవాని చెంబు తలయు, పిల్లి గడ్డమును, ప్రత్తికాయ గ్రుడ్లును, కొంకికత్తియు లోనగు ఘోరాకారము కనులకుఁ గట్టినటు లాయెను. అతఁడు ప్రాణములు వదలెను.

౫

చచ్చినవారి ముచ్చటలు చచ్చినవారికే తెలియవలె. అయినను బ్రతికియున్నవారు ఆముచ్చటలు తెలిపిపోయిరి, తెలుపుచున్నారు, తెలుపఁగలరు.

చచ్చినవారికి మూఁడు దారులు—౧. వెలుతురు దారి ౨. పొగదారి 3. చీఁకటిదారి.

జ్ఞానికి దారి లేదు. 'సున్న సున్నాం గలిసెను' అని శరీరము పోవఁగనే అతఁడు బ్రహ్మమున లయమగును.

వెలుతురు దారి—

భరతఖండము నందడవులలో బ్రహ్మోపాసన చేసినవారి కిది దారి. ఈ చచ్చినవారిని మాస—సంవత్సర—అగ్ని—వాయు ఆదిత్య—చంద్ర—విద్యుత్—వరుణ—ఇంద్ర—ప్రజాపతు లను దేవతలు క్రమముగా నొకరితరువాత నింకొకరు బ్రహ్మలోకమునకుఁ గొంపోవుదురు. అచట వారి యిష్టమే యిష్టము.

పొగ దారి—

యజ్ఞము చేసినవారికిని, యుద్ధమునఁ జచ్చినవారికిని ఇది దారి. ఇటఁ గులభేదము లేదు. కృష్ణరాయలతో పోరి చచ్చిన తురకలు స్వర్గమున కేఁగి కల్పవృక్షముల కల్లులొట్టెలు దింపి త్రావిరఁట. సనకాదుల బొట్లు నాకిరఁట. ఆకాశ గంగలో ఇసుకదిన్నెలమీఁద సప్తఋషు లర్చించుచున్న ఇసుకలింగము లను ముచ్చెలకాళ్లతోఁ ద్రొక్కిరఁట. రంభాదు లెక్కడఁ గానఁ బడిన నక్కడ ఒత్తి కౌఁగిలించిరఁట.

ఈపాగదారినిఁ బడి స్వర్గము చేరినవారు పుణ్యమునం తయు ఖర్చు పెట్టుకొని మరల నీ లోకమునకే రవాణా యగు దురు.

చీఁకటిదారి.—

పాపుల కిది దారి. ఈదారినిఁ బడినవారు నరకపట్నము చేరుదురు. నరకము కలదా లేదా యని యొకని నడుగఁ బని లేదు. పాడు పని చేయఁగనే యది కనఁబడును. పాడుపనికిఁ మనస్సే ప్రమాణము.

ఈచీఁకటిదారిలో నొకపుంత కలదు. ఈపుంతకావల కంత లేదు. థియాసఫిస్టులకును స్పిరిటిస్టులకును భూతమంత్రము లవారికిని ఈపుంత కొట్టిన పిండి. ఈపుంతలో దయ్యములు, తురకదయ్యములు, బర్మా దయ్యములు, తెల్లదయ్యములు, బ్రహ్మరాక్షసులు నివసించును.

ఈదయ్యములను అన్ని దేశములవారును అంగీకరించిరి. ఎవఁ డేభావముతోఁ జచ్చునో వాఁ డాభావముతోఁ బుట్టునని గీతాచార్యు లనిరి. సోమశర్మ కాకిమీసాలవానిని కనులకుఁ గట్టుకొని చచ్చి, వచ్చి, ఈపుంతలోఁ బడి బొమ్మరాకాసియయి, ఆమఱ్ఱిమీఁద మకాము చేసియుండెను. బ్రతికిన నాలుగునాళ్లును అతనికి జగడములతోడను, సంపాదనముతోడనే సరిపోయెను. ఇపుడు తీఱికగనుక నాలుగుపుంజీల ఆఁడుదయ్యముల వలచి వలపించి గార్హస్థ్యము గావింపఁదొడఁగెను.

౬

మాలకూడెము మాఱు మ్రోఁగునటులు భజన చేసి దాసరి నిదిరించెను. రెండవజామున పిల్లియొకటి గుడిసెలోఁ దూఱి కోడిని బట్టఁబోయెను. కోడి కొక్కొ-రో కో యనెను. కోళ్లన్నియు సామగానము చేసెను.

దాసరి లేచి నింగివంకఁ జూచెను. గాఢాంధకారము. వేగుజా మాయెననుకొని అతఁడు గుడికి బయలుదేఱెను.

నింగి మబ్బులచేఁ నిండియుండెను. చీఁకటి ఓ యనిన కో అనుచుండెను. దట్టమగు నడవిలో మరులు మాతంగి త్రొక్కెనేమో అతఁడు తప్పుదారిని బడెను. పొద లన్నియుఁ దిరిగెను. చిగిరింతలచేఁ గప్పఁబడిన పాడు నూతులలోఁ బడి యెట్టెటులో ఒడ్డునకుఁ బ్రాఁకెను. అవురుదుబ్బుల చేలు అన్నియుఁ దిరిగెను.

ముండ్లు లాగుకొనుచు, పల్లేరుకాయలఁ దుడుచుకొనుచు, పూచికలఁ బీఁకుకొనుచుఁ బోయిపోయి తుద కతఁడు మఱ్ఱి కడకుఁ బోవుదారిని జూచి దొరకెనే దొరకె నని ఆ దారిని బడెను.

క్రోలి పాఱవయిచిన కొబ్బరి బొండములవలె పుఱ్ఱెలు పడియుండెను. పచ్చితోళ్లు ఈఁగలు ముసరఁగా కంబళ్లవలె కంపల వ్రేలాడుచుండెను. చీఁకటి కుప్పలవలె వెండ్రుకలు అచట నచట గుట్టలుగాఁ బడి యుండెను. ముందుముందులకుఁ బోవఁగా కుక్కలును, నక్కలును క్రుళ్లిన ప్రేవులకు పెనఁగులాడుచుండెను. దాసరి అది యొక మాదిగగూడె మనుకొనెను. ముందరికి నడచెను.

కుక్కలు ముంగాళ్లమీఁద లేచి చెట్టుమీఁదికి దొంగచూపులు చూచుచు ఎముకలు నోటఁ గఱచుకొని పరుగెత్తుచుండెను. మాంసఖండములు తన్నుకొని పోవు గ్రద్దలు కొమ్మలు తగిలి అఱచుచుండెను. క్రోఁతులు అరచేతి వ్రేటు దిని రొండిని చేతు లిడికొని అంగలార్చుచుండెను. ఇవి యిటులుండఁగా పెద్ద మంట కనఁబడి వెంటనే మాయమాయెను.

'ఎవఁడో ఈచెట్టుమీఁద నున్నాఁడు. ఇది కట్టెలు కొట్టుకొను వేళయా కాదు. కావున వీఁడు మానవుఁడు కాఁడు. నీచుకంపు కొట్టుచున్నది. ఏమిటిరాయిది ?' అని దాసరి పరికించెను.

'నిన్ను చూచితిని లే' అను మాట వినఁబడెను. పెద్ద మంట మండెను. వెంటనే చిమ్మచీఁకటి యాయెను. దాసరి ముందు భమ్మని చప్పుడాయెను. ముందు కొండయెత్తువాఁడు, కండకన్నులవాఁడు, కుండమోఁకాళ్లవాఁడు, నూతిబొడ్డు వాఁడు, శవపుగోఁచివాఁడు, చెంబుతలవాఁడు, తేనెతుట్టె గడ్డమువాఁడు, బూరగాలివాఁడు, కాకిమీసాలవాఁడు !

దాసరి దేవునిఁ దలఁచెను. బ్రహ్మరాక్షసుఁ డొక తాపుతన్నెను. దాసరి దుడ్డుకఱ్ఱతో నొకపెట్టుపెట్టెను.

ఈచప్పుడు విని లేచి ఆఁడుదయ్యములు మూతులు సాఁచి కొమ్మలచివరఁ గూరుచుండెను. బొమ్మరాకాసి దుడ్డుకఱ్ఱ విఱిచి దాసరి డొక్కలో నొక గ్రుద్దు గ్రుద్దెను. దాసరి తప్పించు కొని ఒకపోటు పొడిచెను. బాఁపనదయ్యము మాలని ముక్కు పీఁకఁజూచెను. దాసరి పిడికిలిపోటులే కోటగా తిరిగెను. బేతాళుఁడు ప్రేవుచబుకు జాడించెను. మాలఁడు దానిని లాగుకొనెను. దయ్యము ముందరి కొఱగెను. ఆఁడుదయ్యము లయ్యయ్యో యని యఱచెను. మాలఁ డొక తన్ను తన్ని తప్పించుకొని పాఱిపోఁ జూచెను.

'ముండకూఁతులారా! కుండెఁడు బండెఁడు తిని కూరుచుందురా? వీఁడు తప్పించుకొని పోచున్నాఁడు. రారేమే.' అని తిట్టుచు బొమ్మరాకాసి దాసరిచుట్టు తిరుగఁదొడఁగెను.

'అడుగనిదే అమ్మయు పెట్టదు' అని పేడనీళ్ళుచల్లు కొనుచు పెద్దభార్య సోమిదమ్మ దిగెను. 'పిలువని పేరంటము నకు పోరా దని కూర్చుంటి'నని చిన్నభార్య లంబాడీదయ్యము హాసిలి కాఁబోలు ఎముకకత్తితో, ప్రేవుల త్రాళ్ళతో దిగెను. 'మీరే కాఁబోలు మహాప్రియురాండ్రు' అని బాడించుకొనుచు వెంట్రుకలచీఁపురుతో నొకతె, నరముల యొద్దాణముతో నొకతె, కంకాళపు కఱ్ఱతో నొకతె గబగబదిగిరి.

మగవానిని పట్టుకొనుటకు ఆఁడుదయ్యములు చాల నేర్పరులు. చిన్నదయ్యము నర మొకటి దాసరిమీఁదికి విస రెను. మిగిలిన వారు లాగిరి. బ్రహ్మరాక్షసుఁడు కట్టఁదోడఁ గెను. దాసరి కాళ్లతోఁ ద్రొక్కుచు ఎగురుచు మోఁచేతు లతోఁ బొడుచుచు పెనఁగులాడుచుండఁగా లాగుకొని పోయి బాపనదయ్యము వానిని మఱ్ఱికిఁ గట్టివయిచెను.

౭

'ఓసి సోమీ! కత్తియు కుండయు తే. దొమ్మరనాగీ! పిడకలదాలి పెట్టు. లంబాడీహాసిలీ! నీవు పోయి పైని పడుకో.' అని పురమాయించి బొమ్మరాకాసి దాసరిని జూచి బుసకొట్టి, 'ఒరే! నాచెమట దీసిన నిమ్మారక చంపుదు నను కొంటివా? నీమెడ సగముకోసి వేడివేడి నెత్తురు త్రాగు దును. అదిగో అటు చూడు. ఆతాటితోపున పుత్తెల లొట్టెలు! ఆకల్లు త్రాగుచు పండఁగాల్చిన నీమాంసఖండములు వీ రంద అందియఁగా నంచుకొందును' అనెను.

ఆఁడుదయ్యము లన్నియు తమతమ పనులకు వెళ్లెను. దాసరి యిటు లనెను: 'అయ్యా! వేగిరపడవలదు. నేను మీకంచములోని ముద్దను. నా కీ మేనిమీఁద అంతగా భ్రాంతి లేదు. ఇది పోవుటే మేలు. ఏలందురా, నీచజన్మముతో నొక ప్రాణికి భుక్తి యిడుట ముక్తి కాదా?'

ఏమీ? అంత స్వచ్ఛందశరీరుఁడవా? అగుచో ఇంత పెనఁగితి వేల?

ఊరక చంపనిచ్చుట పాతక మనరా? కాన పెనఁగితిని. దీనికి కినుక వలదు.

ఏమీ పెద్దమాట లాడుచుంటివే! ఊఁ చెప్పు!

అయ్యా, నేనేమి చెప్పఁగలను? అయినను ఒకహితవు పాడెదను. ప్రాణభీతిచేఁ గాదు. మాధ్యస్థ్యమునకు మాట లాడు చుంటిని. అయ్యా! నీవు నక్కవా, పులివా? దేవయోనివే. మీకు మాకంటె పాటవమూ యెక్కువ, తెలివియూ యెక్కువ. ఇట్టి మీకు భక్ష్యాభక్ష్య వివేకము లేనునికి పాడియా? ఈనాశరీరము రుచియా శుచియా? ఇదియు హింసైకలభ్యము. హింసవలన యమబాధ మీకును తప్పదే. మీకు దేవతలు సోదరులుకదా! మీరు వారిచే బాధింపఁబడుట కేమి కారణము? తామసాహారముకాదా? దేవతలకు అమృత మాహారము. అది సాత్త్వికము. దాన వారు

మీకంటె పెక్కేండ్లు జీవింతురు. ఇది యంతయు విచారించి మీకు రుచించినటులు చేయుఁడు.

ఆట్టే చంపకు. మాకు రాని చదువులా ? సరికాని, మాకు దేవతలు సోదరు లని నీవే యంటివి. అగ్ని తినని వస్తు వున్నదా? ఇఁకఁ జాలు. ఇది మాకు వృద్ధానుచారము లే. చదువులు చాలఁ జదివితివి. చదువులతో ఆఁకలి యెవఁడు తీర్చుకొనఁ గలఁడు ? చదువులలో వాదించి నా మెచ్చు గొనలేవుగాని నాయాఁకలి తీర్చి యీచదివినకూర మంచి రుచిగా నున్నదని మాత్రము మెచ్చుకొనఁగలవు.

'అయ్యా ! నీవు సర్వజ్ఞుఁడవు. నాకోనమాలు రావు. నాపొరపాటు లన్నియు మన్నించి నాప్రార్థన మొకటి వినవల యును. కురుంగుడి దేవరను గొలుచుట నాకు నిత్యవ్రతము. సేవ అయినపిదప ఈదేహము తమది.'

బాపనదయ్యము కొంచెము నవ్వి దాసరి చెక్కిలిగొట్టి యిటు లనెను ; 'బలే మోసగాఁడవురా ! దారులు కొట్టికొట్టి నిన్న కాదా దాసరి వైతివి. మంచిది కాని, నీవే చెప్పు— నోటిముద్ద నెవఁడు జాఱవిడుచును ? తప్పించుకొని శరీరము నెవఁ డిచ్చును ? నేను వదలమియు నీవు పోమియు నిక్కము. ఎందుల కీఁక రచ్చ ? చావునకు సిద్ధపడు !'

'నారాయణనారాయణ' యని చెవులు మూసికొని

దాసరి కన్ను లింతలు చేసికొని ఏకాగ్రదృష్టితో నిటు లని యెను: 'నేను మరల రానిచో వామనస్వామిమీఁద ఒట్టు.'

తీవ్రమగు ఈపలుకుబడి బొమ్మరాకాసిని కదిలించివయిచెను. కురుంగుడియు వామనస్వామియు మాలదాసరియు అంతయు గురుతు దగిలెను. వెంటనే బంధము విప్పెను. దాసరి నమస్కరించి వెళ్లిపోయెను.

పిదప పెద్దభార్య మొదలుకొని చిన్న భార్యవఱకును గల రాణివాస మంతయు వచ్చి ముక్కుమీఁద వ్రేలు వేసికొనెను. వారందఱు గలిసి బండుబూతులు తిట్టిరి; ఎడపెడ తన్నిరి. 'ఛేఁ జిక్కినవానిని జాఱవిడిచిన దద్దమ్మవు. ఇఁక నీఛావు నీవు ఛావు' మని తిట్టి పెడాకులీయకయే గుడిసెమీఁద దెబ్బ కొట్టి లేచిపోయిరి.

సోమి యింత సులువుగా లేచిపోయినందులకు వానికి సంతసము కలిగెనుగాని హాసిలికొఱకు కంట తడిపెట్టెను. పిమ్మట చెట్టుమీఁది కెగిరి యిఱుకు కొమ్మలలోఁ గూరుచుండి యేదియో యాలోచించుచుండెను. భార్య లందఱును లేచిపోవుటచే నతనికి వైరాగ్యము కలిగియుండవచ్చును.

౮

'వామనస్వామీ! నేను నీగుఱ్ఱమును, నేను నీకేనుఁగను' అని యనుకొనుచు దాసరి నిండువేగముతో కురుంగుడికి పరువిడెను.

నేఁడు వానిపాట ముక్తికి బాట. వాని పెదవుల మీఁది మందహాసము భగవంతుని చిద్విలాసము. వాని కన్నులు ముక్తికి తెన్నులు. వాని మోము దేవుని గీము. నేఁటి తాండవమున వాని మేను బంతి. వాని యడుగులు తాళములు. దాసరియే నాఁడు భజించెను. వామనుఁడే వినెను. దాసరియే నాఁడు తాండవించెను. వామనుఁడే చూచెను.

వామనుని విడిచి దాసరి వెనుదిరిగెను. వానిమోము మధుకలశము. అతఁడు పొరలుదండము లొనరించి లేచెను. శిఖరము కానిపించునంతవఱకు వెనుకనడకతో మ్రొక్కుచు నడచెను. పిదప మనోదేవాలయముననే వామనుని గొలుచుచుం బరుగెత్తెను. బాపనదయ్యము వెఱ్ఱిచూపులు చూచుచుండఁగా దాసరి మఱ్ఱిక్రిందికిఁ జనెను.

ఆమండు టెండలో తనబట్టతల చత్త్రాతివలెఁ గానిపింపఁగా బ్రహ్మరాక్షసుఁడు చెట్టుదిగి దాసరిముందరికి నడచెను. దాసరికౌఁగిలించుకొని 'మహానుభావా! నా వ్రతము పూర్తి చేయించితివి. నీచెఱఁబాపి నన్ను ముక్తి చెఱలోఁ బెట్టితివి. ఎన్నాళ్లి యాఁకలియో పాపము, పారణచేయుము' అని యనెను.

రాకాసికన్నులు బాష్పములచే గాజులాయెను. కౌఁగిలి వదిలించుకొని మాలనిచుట్టు ప్రదక్షిణ మొనరించెను. నొసలు పాదము లంట వ్రాలెను. పర్యాయముగా పాదములు నెత్తిని

దాల్చి లేచి, 'అయ్యా, అతిదారుణ మగు ఈప్రతిజ్ఞ నీకుఁగాక యొరులకుఁ జెల్లదు' అని స్తుతించుచుండఁగా దాసరి యిటు లనెను! 'అయ్యా! బాస నమ్మి, యాఁకట మాఁడియు, నోటి ముందు ముద్దను జార్చుకొనువానిని నే నెన్నఁడును కని విని యుండ లేదు. గొప్పఁదనము నీదా నాదా ? బాసల కేమి ? నోరి కొలఁది చేయ నగును. అయ్యా, చాల దడవాయె న న్నిఁకఁ దినుము !'

ఇఁక నటు లనవలదు. నరమాంసము చేతనే ఈ బొజ్జ పెరిఁగెను. నీచెలిమితో నాచక్రము తిరిగెను. మీ వంటి భక్తులు మావంటి పాతకులను తరింపఁజేయనిచో మాకు గతి యేమి ? వానకు సముద్ర మయినను ఎడారియయినను ఒక టియే కదా !

అయ్యా ! బాసచొప్పున ఈశరీరము తమదే. నే నీయ ననుట లేదు. ఈశ్వరుఁడే సాక్షి.

వలదు వలదు. నాశరీరము నీవు గొనవలయును. అయ్యా ! నేను ఘంటాకర్ణునికంటె తుంటరినా ? శ్రీకృష్ణుఁ డత నికి శ్రేయ మిడలేదా ? భక్తుఁడు భగవంతుని కంటె మేలు చేయు నందురు. అట్టి మేలు నాకు చేయరాదా ? ఒకనికి మేలు చేయుట భగవత్పూజ కాదా !

అయ్యబాబో ! అంతపని నాతరమా నాబాబు తరమా?

ఆహా ! నీతరమే. అని ఆబొమ్మ రాకాసి దాసరి. పెడతలఁ బట్టి చూపి, 'నాయనా! ని న్నిచ్చట రాతఁ గొట్టితిని' అని చెప్పుచుండఁగా దాసరి 'భగవంతుఁడు నా పాపమున కారీతిగా సుంకము గొనెనే కాని వేఱు కాదు.' అని యనఁగా తెల్లఁబోయి తెలివి దెచ్చుకొని బాపనదయ్యము 'మహాత్ముఁడా! పిదప నేను దొంగచే తన్నులు తిని వానిరూపే తలఁచుచు చచ్చి యిటు లయితిని. బాటసారులను పలువురను ఈపొట్టఁ బెట్టుకొంటిని. పూర్వజన్మమున బ్రాహ్మణుఁడను. దయనీయుఁడను. నేఁడు నీపాడిన వామనస్తుతిఫలమును ధార పోయుము. ఇఁక ఈ నా దేహము తన యిల్లు చేరును.

అమ్మా! ఏమో యనుకొంటిని. ఈశరీరమునకు బదులు నేటి పాటఫలము కాదుసరికదా ఒక త్రుటిఫల మేని యీఁ జాలను. ఈశరీరము లెన్నివచ్చెను, ఎన్ని పోయెను? ఇది బుడగ. సరికాని, కప్పుర మిచ్చి ఉప్పు గొనుమందువా ?

ఔరౌరా! సగమేని యిమ్ము! మీను త్రాగినచో సముద్రమునకుఁ గొఱఁతయా?

అయ్యో! నీకును నాకునుజరిగిన బాసయేమి? ఇపుడు నీ యడుగున దేమి? ఈపాతాళప్రశ్నము లేల? బావిత్రవ్వఁగా బేతాళములు బయలుదేఱినవఁట! పాపము! ప్రొద్దు వోయెను. ఇఁక నన్నుఁ దినుము! ఓయమ్మలారా! కుండ తెండు! కత్తి తెండు! దాలియేది? వీరేరీ? ఎవరును లేరే! పోనిండు! నేనే తెచ్చెదను! ఏడ నున్నవో కొంచెము తెలుపుఁడు.

'ఆసంసారము శాంతించెను. అయ్యా! భక్తులకు దయ వలదా? లోకానుగ్రహముచే రామానుజు లొజ్జ యాన నుజ్జగించి రంగని గోపుర మెక్కి చరమార్థమును చాటలేదా? నీవు లోఁగడఁ జెప్పినటులు కలుషము కాని కాయమునఁగాని కల్యాణము కలుగదు. కావున ఈ పాడు రూ పుడిపి నన్ను కృతార్థుని జేయుము. నీ పాటఫలములో పాతికపాలేని ఇమ్ము.'

అమ్మా, ఎంతాశ?

పోనీ తుది చరణపు ఫలమేని చాలు. ఇదియు ఈయనిచో ఇఁక లేచుట సున్న అని ఆబొమ్మరాకాసి దాసరి పాదములను గట్టిగా లంకించుకొనెను.

అయ్యా! నేను దీనిఫలమెఱుఁగను. పరమేశ్వరుని ముఖోల్లాసమే ఫలము. అదియుఁగాక ఆజ్ఞకుఁగాని అభ్యనుజ్ఞకుఁగాని ఫలపరిగణనము ప్రపన్నునికేడది? మఱియొకటి. ఫలము బంధమునకు ఇక్క. ఫల మింత యనియు అంత యనియు లెక్కవేసి దానిలో ఇంత గొమ్మనుటకు వెఱపు గలుగదా? భగవంతుఁడే మీకు ఏలిక. ఊఱడిలుఁడు.

ఈమాటలు దాసరి నోట నుండఁగనే దయ్యము తల మీఁద పిలకయు, బుజమున జందెములును, మేన బ్రహ్మవర్చసమును పుట్టుకొని వచ్చెను. పొగనుండి నిప్పువలె రాక్షసదేహము నుండి సోమశర్మ వెలువడెను.